బలగం
BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం 30 డిసెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

# బీఆర్ఎస్‌ను దీటుగా ఎదుర్కోవాలి

- జనవరి ఒకటిన పీపీటీకి ఎవ్వరికీ మినహాయింపు లేదు
- మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో భేటీ అయి దిశానిర్దేశం చేశారు. సభలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీని దీటుగా ఎదుర్కోవాలని, వారి విమర్శలకు గట్టి కౌంటర్ ఇచ్చేందుకు సమాయత్తం కావాలని ఆదేశించారు. ముఖ్యంగా జిల్లాల వారీగా మంత్రులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని, ప్రతిపక్షం లేవనెత్తే ప్రతీ అంశానికి సమాధానం ఇస్తూనే గట్టిగా ఎదురుదాడి చేయాలని స్పష్టం చేశారు. సభా నిబంధనలపై పట్టు సాధించాలని, ప్రతిపక్షం తప్పుడు సమాచారం ఇచ్చినప్పుడు 'పాయింట్ ఆఫ్ ఆర్డర్'ను అస్త్రంగా వాడుకోవాలని సూచించారు. మంత్రులందరూ అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ గళాన్ని బలంగా వినిపించాలని అన్నారు.

కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ నీటి వాటాలకు సంబంధించి మిగితా 4వ పేజీలో

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి



- వేగంగా మంత్రులకు, సభ్యులకు సమాచారం అందించాల్సి ఉంటుందని
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు
- జీరో అవర్‌లో సభ్యుల ప్రశ్నలకు అవసరమైన సమాధానాలు అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధం చేయాలి
- ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

శాసన మండలి, శాసనసభ రెండు చట్టసభలు ప్రజాస్వామ్యానికి ప్రతీకలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సభ్యుల ప్రశ్నలకు సంతృప్తి కరంగా సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి, మంత్రులపై ఉంటుందని చెప్పారు. సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో సీనియర్ అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలనీ, పారదర్శకంగా, వేగంగా మంత్రులకు, సభ్యులకు సమాచారం అందించాల్సి ఉంటుందని వివరించారు. సోమవారం శాసనసభ ప్రాంగణంలోని మొదటి సమావేశ మందిరంలో మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబుతో కలిసి సీనియర్ అధికారులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ అత్యంత ప్రజాసామికంగా సభ జరపాలంటూ ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచన చేస్తున్నదనీ, ప్రజలకు, సభ్యులకు జవాబుదారీగా ఉండాలన్న దృఢ సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశాలకు మంత్రులు చాలా సీరియస్‌గా ప్రిపేర్ అయి వస్తున్నందున అధికారులు కూడా అందుకు అనుగుణంగా పూర్తి సమాచారంతో సభలు జరిగినన్ని రోజులు అందుబాటులో ఉండాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభలు అత్యంత పవిత్రమైనవనీ, ఈ సభకు వచ్చే సభ్యులు గొప్ప ఆశయాలు, లక్ష్యాలతో వస్తున్నారన్న విషయాన్ని అధికార యంత్రాంగం గుర్తించాలని సూచించారు. ప్రజలకు ఏదో మేలు చేయాలన్న తపనతో ప్రతి సభ్యుడు సభకు వస్తారనీ, ప్రజల సమస్యలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఏదో ఒక సమాధానం రాబట్టాలన్న ఆలోచనలతో సభ్యులు ఉంటారు కాబట్టి అధికారులు అన్ని ప్రశ్నలకూ పారదర్శకంగా, పూర్తి సమాచారంతో సభకు హాజరై మంత్రులకు తాను వెంటనే సమాచారం ఇచ్చి సభ ద్వారా సంతృప్తికర సమాధానాలు వెళ్లేలా అధికారులు అవసరమైన జాగ్రత్తలు చేపట్టాలన్నారు. సభ జరిగే సమయంలో లైవ్ ప్రసారాల ద్వారా సభను రాష్ట్రంలోని ప్రజలే కాదు, దేశవ్యాప్తంగా ఉన్నవారు ఆసక్తిగా చూస్తారనీ, బయట ప్రభుత్వం ఎంత విజయవంతంగా పరిపాలన అందిస్తుందో అదే తరహాలో సభలోనూ ప్రతిభను చూపాల్సిన అవసరం ఉంటుందని అన్నారు. అందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఉభయ సభలకు సంబంధించిన సమాచారాన్ని అధికారికంగా ధ్రువపరుచుకోకుండా మీడియాలో ఇష్టారీతిన ప్రచురణ లేదా ప్రసారం చేస్తే అది చట్టసభల హక్కుల ఉల్లంఘన కిందికి వస్తుందని చెప్పారు. సమావేశాలకు సంబంధించి మీడియాలో వచ్చిన సమాచారంపై సమాచార శాఖ అధికారులు పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు.

చట్టసభల గౌరవాన్ని, ఔన్నత్యాన్ని పెంచేలా ఉభయ సభలు నిర్వహించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉందనీ, అందుకు అధికారుల నుంచి సంపూర్ణ సహకారం ఉండాలని ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అధికారులకు సూచించారు. ప్రతిరోజు ఉదయాన్నే మీడియాలో వచ్చిన వివిధ అంశాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి సభ్యులు మిగితా 4వ పేజీలో

# తొలి రోజు ప్రశాంతంగా చర్చలు



- అసెంబ్లీలో కేసీఆర్ దగ్గరకెళ్లి నమస్కారం చేసి 'బాగున్నారా' అన్న సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రతి నమస్కారం చేసి బాగే.. అన్నట్టు కేసీఆర్ సైగ
- కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్న నూతన ఎమ్మెల్యే నవీన్ యాదవ్
- 'జనగణమన' అనంతరం వెళ్లిపోయిన మాజీ సీఎం
- సంతాప తీర్మానం కాగానే వెళ్లిపోయిన సీఎం
- మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డికి నివాళులు
- జీరో అవర్‌లో సమస్యలపై అధికార, ప్రతిపక్ష పార్టీల సభ్యుల ఏకరువు
- సభ 2026 జనవరి 2కు వాయిదా

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తొలిరోజు అసెంబ్లీ సమావేశాలు ప్రశాంతంగా జరిగాయి. చాలా కాలం తర్వాత మాజీ సీఎం, అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షనేత కే చంద్రశేఖరరావు (కేసీఆర్) సభకు వచ్చారు. తమపార్టీకి చెందిన ఇతర సభ్యులతో కలిసి సభాసమయానికంటే కొంతముందే వచ్చి తన స్థానంలో కూర్చున్నారు. సరిగ్గా ఉదయం 10:31 నిమిషాలకు సీఎం రేవంత్‌రెడ్డి సభలో అడుగుపెట్టారు. వస్తూనే నేరుగా ప్రతిపక్షనేత కేసీఆర్ దగ్గరికి వెళ్లి చేతులు జోడించి నమస్కరించారు. బాగున్నారా సార్ అంటూ పలుకరించారు. అంతా బాగే అన్నట్టు కేసీఆర్ సైగ చేశారు. ఇద్దరూ కరచాలనం చేసుకున్నారు. ఆ వెంటనే సీఎం వెళ్లి తన సీటులో ఆసీనుల య్యారు. ఆ తర్వాత విప్ ఆది శ్రీని వాస్, మంత్రులు శ్రీధర్‌బాబు, వాకిటి శ్రీహరి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పలువురు ఎమ్మెల్యేలు కూడా కేసీఆర్ దగ్గరకెళ్లి నమస్కారం చేశారు. ఆయన కూడా ప్రతినమస్కారం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలు పొందిన కాంగ్రెస్ సభ్యులు నవీన్ యాదవ్ మర్యాదపూర్వకంగా కేసీఆర్ ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. జాతీయ గీతం 'జనగణమన' ఆలాపన అయిపోగానే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. అనంతరం స్పీకర్ సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా అది అయిపోగానే సీఎం రేవంత్‌రెడ్డి కూడా బయటకు వెళ్లిపోయారు.

**సంతాపం తీర్మానం**

తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి మృతికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వారి మృతికి సంతాపం ప్రకటించారు. ఇరువురి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా దామోదర్‌రెడ్డి అందించిన సేవలను వివరించారు. ఎన్ఎస్ఎస్ స్థాపించి, రాజకీయ రంగంలో రాణించిన లక్ష్మారెడ్డి సేవలను స్మరించుకున్నారు. అనంతరం సభ రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం తెలిపింది.

**పాతబస్తీలో పారిశుధ్యం పడకేసింది**

ఎంఐఎం సభ్యులు బలాల, మాజీద్ హుస్సేన్, జాఫర్ హుస్సేన్ మాట్లాడుతూ..జీహెచ్ఎంసీలో ముఖ్యంగా పాతబస్తీలో పారిశుధ్యం పడకేసిందని ఎత్తిచూపారు. ఓపెన్ గార్బేజ్‌ల నుంచి వారానికోసారి చెత్తను తీసుకెళ్తున్నారనీ, దీంతో అక్కడ దుర్వాసనతో ప్రజలకు వ్యాధులు ప్రబలుతున్నాయని వాపోయారు. వీధి లైట్లను వేయించాలని కోరారు. ఓవర్సీస్ స్కాలర్ షిప్పులు విడుదల చేయాలని బలాల విజ్ఞప్తి చేశారు. చిన్నపిల్లలకు వైద్యం విషయంలో దేశంలోనే ప్రసిద్ధి పొందిన నీలోఫర్ ఆస్పత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలనీ, డాక్టర్ల సంఖ్యను పెంచాలని మాజీద్ హుస్సేన్ విన్నవించారు. నాంపల్లి నియోజకవర్గంలో ఒకేషనల్ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. మూసీ నదిపై మలక్‌పేట్-అంబర్‌పేట మధ్య ఉన్న మూసారాంబాగ్ బ్రిడ్జి పనులు ప్రారంభమై మూడేండ్లు అవుతున్నదనీ, దాన్ని త్వరగా పూర్తిచేయాలని బీఆర్ఎస్ సభ్యులు కాలేరు వెంకటేశ్ కోరారు. ఆ బ్రిడ్జి పనుల్లో ఆలస్యం వల్ల ఆ రూట్‌లో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. కాంగ్రెస్ సభ్యులు నవీన్‌యాదవ్ మాట్లాడుతూ..వర్షాకాలంలో కృష్ణానగర్ ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ఆ సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. హైటెన్షన్ వైర్ల సమస్యను పరిష్కరించేందుకు భూగర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. అరికెపూడి గాంధీ, సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ..తమ నియోజకవర్గాల్లోని డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని విన్నవించారు.

బీఆర్ఎస్ సభ్యులు పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ..తన నియోజకవర్గంలోని కల్వల ప్రాజెక్టును పూర్తిచేస్తే ఆరేడు వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చుననీ, దాన్ని త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. మేడిగడ్డను బాంబు పెట్టి పేల్చినట్టుగానే మంత్రి కొడుకుకు చెందిన మిగితా 4వ పేజీలో

## మళ్లీ 2 నుంచి అసెంబ్లీ

- జనవరి 7వ తేదీవరకు నిర్వహణ
- బీఏసీ నిర్ణయం

వివరాలు 4వ పేజీలో

# ఎక్స్‌ప్రెస్ రైలులో అగ్ని ప్రమాదం

- ఒకరు మృతి
- రెండు ఏసీ బోగీలు దగ్ధం



బలగం టీవీ, అమరావతి

టాటానగర్ నుంచి ఎర్నాకుళం వెళ్తున్న ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ రైలులో అనకాపల్లి జిల్లా యలమంచిలి రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున మంటలు వ్యాపించి రెండు ఏసీ బోగీలు అగ్నికి ఆహుతయ్యాయి. బయటకు రాలేక ఒకరు మృతి చెందారు.సౌత్ సెంట్రల్ డీఆర్ఎం మోహిత్ సోనాకియా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... టాటా నగర్ నుంచి ఎర్నాకుళం వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు (18189)లో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు ఒంటిగంట సమయంలో యలమంచిలి రైల్వే స్టేషన్‌కు సమీపంలోకి వచ్చేసరికి బీ1, ఎం2 బోగీల్లో మంటలు వ్యాపించాయి. దీంతో, అప్రమత్తమైన ప్రయాణికులు చైన్ లాగారు. అదే సమయంలో పొగలు రావడం గమనించిన లోకో పైలెట్, గార్డ్ యలమంచిలి రైల్వే స్టేషన్లో రైలును నిలిపివేశారు. మంటలు వ్యాపించిన రైలు బోగీలను లోకో పైలెట్లు రైలు నుంచి విడదీసి రైలును దూరం చేశారు. రైలులోని బీ1 బోగీలో ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో మంటలు 76 మంది, ఎం2 బోగీలో 82 మంది ప్రయాణికులు ఉన్నారు. అందరు క్షేమంగా దిగిపోగా, బీ1లో ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిన సుందర్ చంద్రశేఖర్ (70) రైలు దిగలేక బోగీలో ఉండిపోయి మంటల్లో కాలిపోయి మృతి చెందారు. రైలు బోగీలకు వ్యాపించిన మంటలను యలమంచిలి, నక్కపల్లి, అనకాపల్లి నుంచి నాలుగు అగ్నిమాపక వాహనాలు సుమారు నాలుగు గంటల పాటు కష్టపడి అదుపులోకి తీసుకొచ్చాయి. అనంతరం సుమారు తెల్లవారుజామున 5.30 గంటలు సమయంలో బీ1, ఎం2 బోగీలను, వాటిలో ప్రయాణికులను అక్కడే వదిలేసి రైలు బయలుదేరి వెళ్లింది. ఆ కాలిన బోగీలను యలమంచిలి రైల్వే యార్డ్‌కు తరలించారు. ఈ రెండు బోగీల్లోని ప్రయాణికులను బస్సుల్లో సామర్లకోట వరకు తరలించి, అక్కడ ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌కు రెండు అదనపు బోగీలను అమర్చి ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చే ఏర్పాట్లు చేసినట్లు డీఆర్ఎం తెలిపారు. చంద్రశేఖర్ మృతదేహాన్ని యలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం అందిస్తామని డీఆర్ఎం తెలిపారు. రైల్వే క్లూస్ టీం, ఫోరెన్సిక్ టీం వారు రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. దర్యాప్తు అనంతరం ప్రమాదానికి కారణాలను వెల్లడిస్తామని డీఆర్ఎం తెలిపారు. రైలు ప్రమాదం విషయం తెలిసిన వెంటనే అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పి తుహిన్ సిన్హా తమ పరివారంతో అక్కడకు వచ్చి పరిశీలించారు. స్థానిక రెవెన్యూ అధికారులు ప్రయాణికులకు అల్పాహారం అందించి, వారిని బస్సుల్లో పంపించే ఏర్పాట్లు చేశారు. రైల్వే డీఐజీ బి.సత్య ఏసుబాబు, అనకాపల్లి ఆర్డిఒ షేక్ ఆయేషా, యలమంచిలి తహశీల్దార్ వరహాలరావు యలమంచిలి సీఐ ధనుజయరావు, ఎస్ఐ సావిత్రి, రైల్వే అధికారులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టును రికార్డు సమయంలో పూర్తి చేశాం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వివరాలు 4వ పేజీలో

# ఉన్నావ్ లైంగికదాడి కేసులో కుల్దీర్‌కు షాక్

- హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీం కోర్టు స్టే
- హర్షం వ్యక్తం చేసిన బాధితురాలు



బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

ఉన్నావ్ లైంగికదాడి కేసులో బీజేపీ మాజీ ఎమ్మెల్యే కుల్దీర్ సింగ్ సెంగార్‌కు ఢిల్లీ హైకోర్టు జారీ చేసిన బెయిల్‌పై సుప్రీంకోర్టు స్టే విధించింది. 2017లో ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో ఓ యువతిని ఉద్యోగం ఇస్తానని ఇంటికి పిలిచి నాటి బీజేపీ ఎమ్మెల్యే కుల్దీర్ సింగ్ సెంగార్ లైంగికదాడికి పాల్పడిన ఘటనపై ఆయనకు న్యాయస్థానం జీవిత ఖైదీ శిక్షను విధించిన విషయం విదితమే. అయితే ఆయనకు విధించిన జీవిత ఖైదును రద్దు చేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై విమర్శలు వెల్లువెత్తాయి. అటు బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. మరోవైపు ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఇద్దరు న్యాయవాదులు అంజలే పటేల్, పూజా శిల్పకర్, సీబీఐ వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. సోమవారం ఈ పిటిషన్లను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జెకె.మహేశ్వరి, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. బాధితురాలి భద్రతకు సంబంధించిన అంశాలతో సీబీఐ ప్రస్తావించిన అంశాలను ధర్మాసనం పరిశీలించింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఉత్తర్వులను నిలిపివేయడంతో పాటు నిందితుడు కుల్దీప్ సెంగార్‌కు నోటీసులు జారీ చేసింది. బెయిల్ రద్దు పిటిషన్‌పై నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని సెంగార్‌ను ఆదేశించింది. అలాగే డిసెంబర్ 23న ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు బీజేపీ మాజీ ఎమ్మెల్యే కుల్దీర్ సింగ్ సెంగార్‌ను జైలు నుంచి విడుదల చేయొద్దని సూచించింది.

సీబీఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ హైకోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వాలని కోరారు. సెంగార్ తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ దవే, ఎన్. హరిహరన్ వాదనలు వినిపిస్తూ సీబీఐ పిటిషన్‌ను వ్యతిరేకించారు. లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం (పోక్సో చట్టం) సెక్షన్ 5 కింద 'ప్రజా సేవకుడు (పబ్లిక్ సర్వెంట్)' అనే పదానికి హైకోర్టు ఇచ్చిన వివరణ తప్పుగా ఉందని, చివరికి చట్టాన్ని రూపొందించే వారిని మినహాయింపునకు దారి తీస్తుందని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. "చట్టపరమైన సమస్యను పరిగణనలోకి తీసుకోవాలి. ఈ ఉత్తర్వును జారీ చేసిన హైకోర్టు న్యాయమూర్తులు అత్యుత్తమ న్యాయమూర్తులు. కానీ మనమందరం తప్పులు చేసే అవకాశం ఉంది. దయచేసి పోక్సో కింద "పబ్లిక్ సర్వెంట్" అనే దానికి ఈ నిర్వచనాన్ని చూడండి. చట్టం ప్రకారం ఒక కానిస్టేబుల్ ప్రభుత్వ సేవకుడిగా ఉంటాడని, కానీ శాసనసభ సభ్యుడు మినహాయించబడతారని మేము ఆందోళన చెందుతున్నాం" అని అత్యున్నత ధర్మాసనం పేర్కొంది. ఉన్నావ్ లైంగికదాడి కేసులో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడం పట్ల బాధితురాలు సంతృప్తి వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థపై తనకు పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు.

# మున్సిపల్ ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని 6 మున్సిపల్ కార్పొరేషన్లు, 117 మున్సిపాల్టీలకు సంబంధించి అన్ని వార్డుల్లో పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల జాబితా తయారీ, ప్రచురణకు సంబంధించిన షెడ్యూల్‌ను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం కమిషనర్ రాణి కుముదిని సర్క్యులర్ జారీ చేశారు. ఈ నెల 30న పోలింగ్ స్టేషన్ల వారీగా డేటాను తిరిగి అమర్చాలనీ, 31న వార్డుల వారీగా పోలింగ్ స్టేషన్ల సమాచారం పునర్వ్యవస్థీకరించడం, అదే రోజు పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల రోల్స్‌లో డేటాను చేర్చాలని పేర్కొంది. జనవరి 1న పేర్లు, చిరునామాలపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. అనంతరం నోటీసు బోర్డులపై పోలింగ్‌స్టేషన్ల వారీగా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. 5న యూఎల్బీ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మున్సిపాల్టీ, కార్పొరేషన్ కమిషనర్ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నారు. 6న జిల్లా స్థాయిలో ఎన్నికల అధికారుల సమీక్ష జరుగుతుంది. అనంతరం జనవరి 10న ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తారు.

# అసెంబ్లీ చర్చల్లో కేసీఆర్ పాల్గొనాలి

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విఫ్ ఆది శ్రీనివాస్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కేసీఆర్ వస్తున్నారని బీఆర్ఎస్. నేతలు చాలా హడావిడి చేశారనీ, కేసీఆర్ రావడం, సంతకం పెట్టడం, వెళ్ళిపోవడం నిమిషాల వ్యవధిలో జరిగిపోయిందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విఫ్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. మరణించిన ఎమ్మెల్యేలకు సంతాపం ప్రకటించకుండా వెళ్లిపోయారంటే శాసన సభ సభ్యులపై ఉన్న గౌరవం ఏంటో అర్థం అవుతుందన్నారు. కేసీఆర్ వస్తున్నారంటే హడావిడి ఎందుకని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని ప్రజలు ఎన్నుకున్నారని తెలిపారు. అసెంబ్లీని కేసీఆర్ కుటుంబం రాజకీయ వేదికగా మార్చుకోవద్దన్నారు. ఒక ఎమ్మెల్యేగా, ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ అసెంబ్లీ చర్చల్లో పాల్గొనాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలపై మాత్రమే కాదు అసెంబ్లీలో చర్చ అనీ, గడిచిన పదేండ్లలో కృష్ణా నీటి వాటాల విషయంలో జరిగిన నష్టంపై కూడా చర్చ అసెంబ్లీలో జరుగుతుందన్నారు. అసెంబ్లీని మామా, అల్లుల్ల గొడవకు వేదికగా మార్చుకోవద్దన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాలు రాజకీయంగా వాడుకోకుండా సలహాలు, సూచనలు కేసీఆర్ ఇస్తారని ఆశిస్తున్నామన్నారు.

# కేరళ తరహాలో పేదరిక నిర్మూలనకు ప్రత్యేక ప్రణాళికలు



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో


కేరళ తరహాలో రాష్ట్రంలో అత్యంత పేదరిక నిర్మూలన కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించనున్నట్టు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షుల సమావేశంలో ఆమె సర్పంచులుగా ఎన్నికైన సూర్యాపేట, వనపర్తి జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు సరిత, స్వరూపలను సన్మానించారు. జిల్లాల వారీగా నెల రోజులపాటు మహిళా సంఘాలు, సమాఖ్యలు నిర్వహించిన కార్యకలాపాలను ఆమె సమీక్షించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన వారిని మహిళా సంఘాలు గుర్తిస్తే, వారి అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు. వారిని గుర్తించేందుకు అవసరమైన ప్రొఫార్మాను త్వరలోనే అందజేస్తామని తెలిపారు. కేరళలో సర్వే ద్వారా 64,006 కుటుంబాల్లోని దాదాపు లక్ష మంది తీవ్రమైన పేదరికంలో ఉన్నట్టు గుర్తించి, ఆయా కుటుంబాల అవసరాలను గుర్తించేందుకు వీలుగా ప్రత్యేక మైక్రో ప్లాన్‌ను రూపొందించినట్టు చెప్పారు. తెలంగాణలో ఇదే తరహాలో మైక్రోప్లాన్ రూపొందిస్తామని వివరించారు. వారికి గుర్తింపు కార్డులు, ఇండ్లు, ఉపాధి అవకాశాలు, వైద్య సంరక్షణ వంటి సహాయాలు అందించనున్నట్టు వెల్లడించారు. పంచాయతీరాజ్ శాఖతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలు, వాలంటరీ ఆర్గనైజేషన్స్, ప్రజలను సమీకరించి ఈ లక్ష్యాన్ని సాధించిందనీ, అదే తరహాలో తెలంగాణలో మహిళా సంఘాలు భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. జిల్లా మహిళా సమాఖ్యలు ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని కేక్‌కట్ చేసి మహిళా సంఘ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ తదితరులు పాల్గొన్నారు.

# దీర్ఘశ్రేణి గైడెడ్ రాకెట్ పినాక ప్రయోగం సక్సెస్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

దీర్ఘశ్రేణి గైడెడ్ రాకెట్ పినాక (ఎల్ఆర్‌జీఆర్ 120) ప్రయోగం విజయవంతమైంది. ఒడిశాలోని చండీపూర్ నుంచి డీఆర్‌డీవో ఈ ప్రయోగాన్ని చేపట్టింది. పినాకకు 120 కి.మీ దూరంలో లక్ష్యాన్ని ఛేదించే సామర్థ్యం ఉంది. ఎల్ఆర్‌జీఆర్ 120 ప్రయోగం విజయవంతమైందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ప్రయోగం చేపట్టిన డీఆర్‌డీవోను అభినందించారు.

# హరీశ్‌రావు X మంత్రి శ్రీధర్‌బాబు



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

జీరో అవర్ అరణ్యరోదనగా మారిందనీ, మంత్రులు నోట్ చేసుకుంటున్నామని చెబుతున్నారుగానీ సమాధానాలు పంపడం లేదనీ, సమస్యలు పరిష్కరించడం లేదని బీఆర్ఎస్ సభ్యులు టి.హరీశ్‌రావు విమర్శించారు. సోమవారం అసెంబ్లీలో జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి రథచక్రాలుగా ఉండే ఉద్యోగులు తీవ్ర మనోవేదనలో ఉన్నారనీ, వారి ఆరు డీఏలు పెండింగ్‌లో పెట్టడం దుర్మార్గమని అన్నారు. పీఆర్సీ రెండేండ్లుగా పెండింగ్‌లో ఉందని ప్రస్తావించారు. తమ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఈహెచ్ఎస్ జీవోను అమలు చేయడం లేదని విమర్శించారు. పీఎఫ్, రిటైర్డ్ బెనిఫిట్స్ అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సీపీఎస్‌ను ఓపీఎస్‌గా మారుస్తామన్నహామీ ఏమైందని ప్రశ్నించారు. పోలీసులకు సరెండర్ లీవ్‌లు ఎందుకు పెండింగ్‌లో పెడుతున్నారని అడిగారు. పోలీసులకు ఆరోగ్యభద్రత స్కీమ్‌ను లక్ష రూపాయలకు కుదించడం దారుణమన్నారు. దీనికి మంత్రి శ్రీధర్‌బాబు సమాధానమిస్తూ..ఉద్యోగుల సమస్యల గురించి హరీశ్‌రావు మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించనట్టుగా ఉందని విమర్శించారు. 20వ తేదీ వరకు కూడా జీతాలు చెల్లించనివారు ఇప్పుడు ఉద్యోగుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. జీపీఎఫ్, రిటైర్డ్ బెనిఫిట్స్ అందించేందుకు తమ ప్రభుత్వం వ్యవస్థను ఏర్పాటు చేసుకుని ముందుకెళ్తుందని చెప్పారు.

## మీడియా పాయింట్

# ముదిరాజ్‌లను 'బీసీ-డి' నుంచి 'ఏ'లోకి మార్చాలి

- మండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ముదిరాజ్ కులస్తులను బీసీ-డీ గ్రూపు నుంచి బీసీ-ఏ గ్రూపులోకి మార్చాలన్న చిరకాల డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన అసెంబ్లీ మీడి యా పాయింట్ మాట్లాడారు. ఇది ఎప్పటి నుంచో ఉన్న ప్రధాన డిమాండ్ అని, ఈ అంశం ప్రస్తుతం బీసీ కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉందని గుర్తుచేశారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ తమ మ్యానిఫెస్టోలో ముదిరాజ్ కులస్తులను బీసీ-డి నుంచి బీసీ-ఏ కు మారుస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిందని తెలిపారు. కానీ అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఆ హామీని నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ విషయంపై తక్షణమే స్పందించి, బీసీ కమిషన్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటికే బీసీ కులగణన ప్రక్రియ పూర్తయినందున, ఆ డాటా ఆధారంగా కమిషన్ నుంచి నివేదికను తెప్పించుకొని, ముదిరాజ్‌ల రిజర్వేషన్ అంశాన్ని వెంటనే కొలిక్కి తేవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# వరంగల్‌లో రాజస్థాన్ అంతర్రాష్ట్ర ఏటీఎం చోరీ ముఠా అరెస్టు




- **వివరాలు వెల్లడించిన వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ కవిత**

**బలగం టీవీ, వరంగల్:**

ఏటీఎం మిషన్లలో నగదు బయటకు రాకుండా ఇనుప రేకులు అడ్డం పెట్టి, ఖాతాదారులు వెళ్ళిపోగానే ఆ సొమ్మును కాజేస్తున్న రాజస్థాన్‌కు చెందిన ఒక ప్రమాదకరమైన అంతర్రాష్ట్ర ముఠాను వరంగల్ పోలీసులు అరెస్టు చేశారు. వరంగల్ సెంట్రల్ జోన్ డిసిపి కవిత శనివారం మీడియాకు వివరాలు వెల్లడిస్తూ, సిసిఎస్ మరియు కాజీపేట పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో ఏడుగురు నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 5.10 లక్షల నగదు, రెండు కార్లు, ఏడు సెల్‌ఫోన్లు, నేరానికి వాడే ఐరన్ ప్లేట్లు మరియు డూప్లికేట్ తాళం చెవులను స్వాధీనం చేసుకున్నారు.

నకిలీ తాళాలు.. ఇనుప రేకులతో 'టెక్నికల్' చోరీ రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లాకు చెందిన ఈ ముఠా సభ్యులు జల్సాల కోసం సులభంగా డబ్బు సంపాదించాలని ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. ఎస్.బి.ఐ ఏటీఎంలలో ఉండే '%్రావతీశీ%' కంపెనీ మిషన్లలోని సాంకేతిక లోపాలను అధ్యయనం చేసిన వీరు, ఆ మిషన్లను తెరిచేందుకు నకిలీ తాళాలను తయారు చేసుకున్నారు. ఏటీఎం కేంద్రంలోకి ప్రవేశించి, డబ్బు వచ్చే మార్గంలో ఎవరికీ కనిపించకుండా గమ్‌తో ఒక ఇనుప ప్లేటును అతికించేవారు. ఖాతాదారులు డబ్బు డ్రా చేసినప్పుడు ఆ ప్లేటు అడ్డుపడి నగదు బయటకు వచ్చేది కాదు. మిషన్ రిపేర్ అని భావించి కస్టమర్ వెళ్ళిపోగానే, పరిసరాల్లోనే కాచుకుకూర్చున్న నిందితులు లోపలికి వెళ్లి నకిలీ తాళంతో మిషన్ తెరిచి నిలిచిపోయిన నగదును దొంగిలించేవారు.

40కి పైగా నేరాలు.. వరంగల్‌లో 7 ఏటీఎంలలో చోరీ ఈ ముఠా ఇప్పటివరకు తమిళనాడు, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా 40కి పైగా చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. వరంగల్ ట్రై సిటీ పరిధిలో గత నవంబర్ నుండి సుబేదారి, కాజీపేట, హన్మకొండ మరియు మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ల పరిధిలోని 7 ఏటీఎంలలో మొత్తం రూ. 12.10 లక్షలు కాజేశారు. ఖాతాదారుల ఫిర్యాదుతో అప్రమత్తమైన బ్యాంక్ అధికారులు మరియు సెక్యూరిటీ సంస్థ పోలీసులను ఆశ్రయించడంతో ఈ ముఠా గుట్టు రట్టయింది. కాజీపేట చౌరస్తా వద్ద మళ్లీ చోరీకి ప్రయత్నిస్తుండగా పోలీసులు వీరిని చాకచక్యంగా వెంబడించి పట్టుకున్నారు.

పోలీసుల అభినందన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ ముఠాను పట్టుకున్న క్రైమ్స్ అదనపు డీసీపీ బాల స్వామి, ఏసీపీలు సదయ్య, ప్రశాంత్ రెడ్డి, మరియు సీసీఎస్, కాజీపేట పోలీసు బృందాలను వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించి రివార్డులను అందజేశారు. ఇలాంటి ముఠాలు దేశవ్యాప్తంగా తిరుగుతున్నాయని, బ్యాంక్ అధికారులు పాత ఏటీఎం మిషన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని పోలీసులు సూచించారు.

# పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై పీపీటీకి అవకాశం ఇవ్వాలి

- **స్పీకర్‌కు బీఆర్ఎస్ఎల్పీ వినతి**

**బలగం టీవీ, హైదరాబాద్**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు మరియు కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై అసెంబ్లీలో తమ వాదనను వినిపించేందుకు సిద్ధమయింది ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వాలని భావిస్తున్న నేపథ్యంలో, తమకు కూడా తమ వెర్షన్‌ను ప్రజల ముందు ఉంచేందుకు పీపీటీ అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ శాసనసభాపక్షం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించింది.

**వినతిపత్రంలోని ముఖ్యాంశాలు**

ప్రభుత్వం ఒకవైపు ప్రాజెక్టుపై పీపీటీ ఇస్తుంటే, ప్రతిపక్షంగా వాస్తవాలను వివరించే బాధ్యత తమపై ఉందని, కాబట్టి తమకు కూడా అదే స్థాయిలో సమయం, అవకాశం ఇవ్వాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నీటి వాటాను 90 టీఎంసీల నుండి 45 టీఎంసీలకు తగ్గించేలా ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ ఆరోపించింది. దీనిపై అసలు వాస్తవాలను సభ దృష్టికి తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే 90 శాతం పనులు పూర్తయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం మిగిలిన పనులను గాలికొదిలేసిందని, ఈ విషయాలను గణాంకాలతో సహా వివరించాలని భావిస్తున్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు రావలసిన వాటాపై జరుగుతున్న చర్చలో ప్రభుత్వం ఇచ్చే అరకొర సమాచారానికి బదులు, పూర్తి స్థాయి సాంకేతిక వివరాలతో పీపీటీ ఇచ్చేందుకు అనుమతించాలని కోరారు.



# పాలమూరును మళ్లీ వలసల జిల్లాగా మార్చిన రేవంత్

- **పాలమూరు నీళ్ల కోసం కేసీఆర్ పోరాటానికి సిద్ధం**
- **యూరియా క్యూలైన్లే ఎందుకు నిదర్శనం**
- **పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పండబెట్టింది కాంగ్రెస్**
- **కాంగ్రెస్-బీజేపీ చీకటి స్నేహం బయటపడింది**

**బలగం టీవీ, నాగర్ కర్నూల్:**

నాగర్ కర్నూల్‌లో నిర్వహించిన నూతన సర్పంచుల ఆత్మీయ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలమూరు జిల్లాను మళ్లీ వలసల జిల్లాగా మార్చిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందని ఆయన మండిపడ్డారు.

**పాలమూరు ప్రాజెక్టులపై నిర్లక్ష్యం**

కేసీఆర్ హయాంలో పాలమూరు జిల్లా సస్యశ్యామలం అయిందని, ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తయ్యాయని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో కనీసం 10 శాతం పనులు కూడా పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. "తట్టెడు మట్టి కూడా తీయకుండా నికృష్టపు మాటలు మాట్లాడుతున్నారు. ప్రాజెక్టులను పండబెట్టి జిల్లాను ఎండబెడుతున్నారు" అని ధ్వజమెత్తారు. తెలంగాణ నీటి వాటాల కోసం కేసీఆర్ త్వరలోనే పాలమూరు గడ్డపై పోరాటానికి సిద్ధమవుతున్నారని, జిల్లా బిడ్డలంతా ఆయనకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు.



**రైతుల గోస -హామీల మోసం**

"రాష్ట్రంలో రైతు బంధు పాలన పోయి రేవంత్ 'రాబందు' పాలన వచ్చింది" అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రైతులు యూరియా బస్తాల కోసం క్యూలైన్లలో చెప్పులు పెట్టి వేచి చూడాల్సిన దుస్థితి రావడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ఎన్నికల ముందు అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు వాటి అమలు గురించి అడిగితే బూతులు మాట్లాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకం ఏమైందంటే "గుడ్ల పీకి గోటీలాడతా" అని ముఖ్యమంత్రి అనడం ఆయన ఫ్రస్టేషన్‌కు నిదర్శనమని విమర్శించారు.

**సర్పంచులకు ధైర్యం- రాజ్యాంగమే రక్షణ**

నూతనంగా గెలిచిన సర్పంచులకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలుపుతూ.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల బెదిరింపులకు భయపడవద్దని ధైర్యం చెప్పారు. "రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఎలాగో, గ్రామానికి సర్పంచ్ కూడా అంతే. మీకు అంబేద్కర్ రాసిన రాజ్యాంగం రక్షణగా ఉంటుంది" అని స్పష్టం చేశారు. ఫైనాన్స్ కమిషన్ నిధులు నేరుగా గ్రామ పంచాయతీలకే వస్తాయని, అందరూ కలిసి మెలిసి గ్రామాలను అభివృద్ధి చేయాలని సూచించారు.

**హైదరాబాద్ భూములపై రేవంత్ కన్ను - బీజేపీతో చీకటి ఒప్పందం**

హైదరాబాద్‌లో 9,300 ఎకరాల ప్రభుత్వ భూములపై రేవంత్ కన్ను పడిందని, 'హిల్ట్' పాలసీ పేరుతో రూ. 5 లక్షల కోట్లు కొల్లగొట్టేందుకు కుట్ర పన్నారని కేటీఆర్ ఆరోపించారు. లగచర్లలో గిరిజనుల భూములను గుంజుకుంటుంటే బీఆర్ఎస్ అడ్డుకుందని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు దొంగ చీకటి ఒప్పందం చేసుకున్నాయని, అందుకే రేవంత్ దోపిడీని బీజేపీ ప్రశ్నించడం లేదని మండిపడ్డారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం

- **మహబూబాబాద్ యువతులు మృతి**

**బలగం టీవీ, మహబూబాబాద్**




అమెరికాలోని కాలిఫోర్నియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా కు చెందన ఇద్దరరు యువతులు మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మీసేవ కేంద్రం నిర్వాహకుడు నాగేశ్వరరావు కూతురు మేఘన, ముల్కనుర్ ఉప సర్పంచ్ కోటేశ్వరరావు కూతురు భావన ఉన్నత చదువుల కోసం వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# మఖ్యమంత్రి కృష్ణానది ఏ బేసిన్, ఎక్కడున్నదని అడిగాడు.

- **బాక్ర నంగాల్ ఏ రాష్ట్రంలో ఉన్నదో తెల్వని ముఖ్యమంత్రి.**
- **కేసీఆర్ వస్తున్నాడు అని చర్చకు వాళ్ళు ప్రిపేర్ అవుతున్నారు.**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**బలగం టీవీ, హైదరాబాద్:**

ముఖ్యమంత్రికి క ృష్ణా నది ఏ బేసిన్‌లో ఉందో, ఎక్కడ ఉందో కూడా కనీస అవగాహన లేదు. భాక్రా నంగల్ ప్రాజెక్టు ఏ రాష్ట్రంలో ఉందో తెలియని వ్యక్తి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం దురద ృష్టకరం. గతంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును అడ్డుకున్న వ్యక్తినే నేడు నీటిపారుదల శాఖకు సలహాదారుగా నియమించుకున్నారు. నీటిపారుదల శాఖపై కనీస అవగాహన లేని వారంతా కలిసి నేడు ఆ శాఖపై చర్చ జరుపుతామంటున్నారుబీ అసలు వారు దేనిపై చర్చించాలనుకుంటున్నారో వారికే తెలియదు. కేసీఆర్ ని చర్చకు రావాలని డిమాండ్ చేస్తున్న వారు, ఆయన వస్తున్నారని తెలిసి భయంతో ప్రిపేర్ అవుతున్నారు. మేడిగడ్డ ప్రాజెక్టును ఎవరో కావాలనే బాంబులు పెట్టి పేల్చారని కౌశిక్ రెడ్డి సభలో స్పష్టంగా వివరించారు. కేవలం బూతులు మాట్లాడాలంటే ఎన్ని రోజులైనా చర్చ జరపవచ్చు కానీ, సబ్జెక్ట్ లేనప్పుడు సభను ఎక్కువ రోజులు నడపలేరు. చెక్ డ్యామ్‌ల పేల్చివేత వెనుక రాఘవ కన్స్ట్రక్షన్ కంపెనీ హస్తం ఉందని ఆరోపణలు ఉన్నాయి.మేడిగడ్డను పేల్చివేశారని ఆనాడు ఇంజనీర్లు ఫిర్యాదు చేసినా, ప్రభుత్వం దానిపై ఎందుకు విచారణ జరిపించడం లేదు? బాధ్యులపై చర్యలు ఏవి? రష్యా యుద్ధం (ఉద్యమం) సమయంలో 'కాఖోవ్కా' డ్యామ్‌ను ఎలాగైతే పేల్చారో, ఇక్కడ మేడిగడ్డను కూడా అలాగే పేల్చారని ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ క్లుప్తంగా వివరించారు. అసెంబ్లీలో సమయపాలన పాటించడం లేదు.. ఎన్నడూ లేని విధంగా మొదటి రోజే 'జీరో అవర్' పెట్టడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనం.

# రాష్ట్రవ్యాప్తంగా మాజీ సర్పంచుల అరెస్టులు

- **బిల్లులు అడిగితే బేడీలా?**
- **మాజీ సర్పంచుల అరెస్టులు అన్యాయం.**
- **పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని జేఏసీ డిమాండ్**

**బలగం టీవీ, హైదరాబాద్**




తమ హయాంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తాజా మాజీ సర్పంచుల జేఏసీ పిలుపునిచ్చిన 'చలో అసెంబ్లీ' ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అక్కెనపెల్లి కరుణాకర్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా, నేటికీ బకాయిలు చెల్లించకపోవడం సర్పంచులపై ముఖ్యమంత్రి అనుసరిస్తున్న కక్ష సాధింపు చర్యేనని ఆయన మండిపడ్డారు.

2019-24 కాలంలో సర్పంచులు తమ సొంత డబ్బులతో, అప్పులు తెచ్చి మరీ గ్రామాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని కరుణాకర్ గుర్తు చేశారు. పల్లెలను దేశానికి ఆదర్శంగా నిలిపి రాష్ట్రానికి ఎన్నో అవార్డులు తెచ్చిపెట్టిన ఘనత సర్పంచులదని, అలాంటి వారికి నేడు న్యాయబద్ధంగా రావాల్సిన బిల్లులు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే అప్పుల బాధ తాళలేక ఎంతోమంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ప్రభుత్వం ఇప్పుడు బిల్లులు ఇచ్చినా అవి వడ్డీలకు కూడా సరిపోవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

రాబోయే 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి సుమారు 3000 కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేసి, సర్పంచులతో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని జేఏసీ డిమాండ్ చేసింది. గతంలో సర్పంచులను ఆదుకుంటానని, వారికి అండగా ఉంటానని ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని కోరారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకపోతే భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

# కేసీఆర్‌ను కలవడానికి ఎమ్మెల్యే గాంధీకి మొహం చెల్లలేదు : జగదీష్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**



బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌కు ఫిరాయించిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై మాజీ మంత్రి జగదీష్ రెడ్డి నిప్పులు చెరిగారు. "కేసీఆర్ చుట్టూ దుర్మార్గులు ఉన్నందునే ఆయనను కలవలేదు" అన్న గాంధీ వ్యాఖ్యలపై జగదీష్ రెడ్డి ఘాటుగా స్పందించారు. పార్టీకి ద్రోహం చేసి, కేసీఆర్‌ను వదిలి వెళ్ళిన వారే అసలైన దుర్మార్గులని, ఆయన చుట్టూ ఎప్పుడూ మంచి వారే ఉంటారని కౌంటర్ ఇచ్చారు.కేసీఆర్‌ను కలిసే ధైర్యం లేక, మొహం చెల్లకనే అరికెపూడి ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ మారిన తన తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఎదురుదాడికి దిగడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ మాటల యుద్ధంతో తెలంగాణ రాజకీయాల్లో వేడి రాజుకుంది.

# న్యూ ఇయర్ వేడుకలు శాంతియుతంగా జరుపుకుందాం

- **డిసెంబర్ 31న రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు**
- **మద్యం సేవించి ర్యాష్ డ్రైవింగ్ , బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్ తొలగించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు.**
- **డీజేలు, అధిక శబ్ద పరికరాలపై పూర్తి నిషేధం**
- **ఉల్లంఘిస్తే కేసులు తప్పవు.**
- **మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే, వాహనాల యజమానులపై, తల్లిదండ్రులపై కేసులు**
- **వేడుకల పేరుతో ప్రజా భద్రతకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవు.**
- **జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



వచ్చే నూతన సంవత్సర వేడుకలను ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య, శాంతియుతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపిఎస్ సూచించారు. వేడుకల పేరుతో హద్దులు మీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. డిసెంబర్ 31న జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

**డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం.**

డిసెంబర్ 31 రాత్రి పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా, వాహనాలను సీజ్ చేసి జైలు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**డీజేలపై పూర్తి నిషేధం.**

ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా నిబంధనలకు విరుద్ధంగా డీజేలు, అధిక శబ్ద పరికరాలను ఏర్పాటు చేయడంపై పూర్తి నిషేధం విధించారు. ఒకవేళ ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే సదరు పరికరాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏవైనా కార్యక్రమాలు నిర్వహించాలనుకునే వారు పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరి.

**ముఖ్యమైన సూచనలు మరియు నిబంధనలు:**

ర్యాష్ డ్రైవింగ్: బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్ తొలగించి శబ్ద కాలుష్యం చేసే వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంటుంది.

**మైనర్ డ్రైవింగ్:** మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే, ఆ వాహన యజమానులతో పాటు వారి తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తారు.

అసాంఘిక కార్యకలాపాలు: ఇళ్లు, ప్రైవేట్ ఆస్తులు, వీధి దీపాలపై రాళ్లు వేయడం, ఆస్తులను ధ్వంసం చేయడం వంటి పనులకు పాల్పడితే ఉపేక్షించబోరు.

మహిళల భద్రత: మహిళలను ఇబ్బంది పెట్టేలా ప్రవర్తించే ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటారు.

**మత్తు పదార్థాలు:** గంజాయి, డ్రగ్స్ వంటి నిషేధిత పదార్థాల విక్రయం లేదా వినియోగంపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ హెచ్చరించారు.

**బహిరంగ మద్యపానం:** ప్రభుత్వ స్థలాలు, రోడ్లపై మద్యం సేవిస్తే కఠిన చర్యలు ఉంటాయి.

ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన జరిగినా లేదా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా వెంటనే 'డయల్ 100' కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. చివరగా, 2026 సంవత్సరంలో జిల్లా ప్రజలందరికీ శుభం కలగాలని ఆకాంక్షిస్తూ, పోలీస్ శాఖ తరపున జిల్లా ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

# మాజీ సర్పంచ్‌ల అరెస్టులను ఖండిస్తున్నాం

- **జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తమ హయాంలో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపునిచ్చిన 'చలో అసెంబ్లీ' ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా బకాయిలు విడుదల చేయకపోవడంతో మాజీ సర్పంచులు తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారని, అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా పోలీసులు అర్ధరాత్రి నుంచే మాజీ సర్పంచులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశానికే ఆదర్శంగా గ్రామాలను తీర్చిదిద్దిన తమపై ఈ కక్షసాధింపు చర్యలు ఎందుకని ప్రశ్నించిన ఆయన, మంత్రులు మరియు ఎమ్మెల్యేలు స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుంటి మధుసూదన్ రెడ్డి, రాంపాక నాగయ్య, కేశబోయిన మల్లయ్య, రవీందర్రావు, సుభాష్ గౌడ్, యాకూబ్ నాయక్ తదితరులు పాల్గొని, పెండింగ్ బిల్లులు ఇచ్చే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు.

# డిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ..

- **బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటే**
- **సర్పంచుల సమస్యలపై ముందుండి పోరాడుతా**
- **సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు సుభాష్**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**




రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల తీరు "ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ" అన్నట్లుగా ఉందని సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు అందె సుభాష్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం ఆయన తన ఎన్నిక అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.

ఈ సందర్భంగా అందె సుభాష్ మాట్లాడుతూ.. సర్పంచ్‌ల ఫోరం ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు నైతిక విలువలను పక్కనబెట్టి అనైతిక పొత్తు పెట్టుకున్నాయని సుభాష్ మండిపడ్డారు. ఒక దళిత సర్పంచ్ ఫోరం అధ్యక్షుడిగా ఎన్నిక కాకూడదనే కుట్రతోనే ఈ రెండు పార్టీలు ఏకమయ్యాయని ఆయన ఆరోపించారు. తమ పార్టీకి చెందిన 12 మంది సర్పంచ్‌లతో పాటు, ఒక బీజేపీ సర్పంచ్ కూడా తమకు మద్దతు ఇచ్చారని ఆయన స్పష్టం చేశారు. సహజంగా వైరి వర్గాలుగా ఉండాల్సిన బీజేపీ, కాంగ్రెస్‌లు ఇక్కడ ఒక్కటి కావడం ప్రజలను వంచించడమేనని అన్నారు. బీజేపీ నాయకులకు దమ్ముంటే తాము కాంగ్రెస్‌తో కలిశామని బాహటంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలు నమ్మి ఓటు వేస్తే, వారి నమ్మకాన్ని ఈ పార్టీలు తాకట్టు పెట్టాయని, ఈ విషయాన్ని గ్రామగ్రామాన ఎండగడతామని హెచ్చరించారు. సర్పంచ్‌లకు ఏవైనా సమస్యలు ఎదురైతే ప్రభుత్వంపై పోరాడాల్సిన సమయంలో బీజేపీ నాయకులు ఎటువైపు ఉంటారో అర్థం కావడం లేదని సుభాశ్ ఎద్దేవా చేశారు. తాను మాత్రం సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడతానని, ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేసేలా ఒత్తిడి తెస్తామని చెప్పారు. గతంలో దొమ్మాట నర్సయ్య సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతో కలిసి తాను చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు ఎన్గందుల నర్సింలు, కొండ రమేశ్‌గౌడ్, భూక్యా రజిత, అజ్మీరా రాజు, అజ్మీరా తిరుపతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి మరియు నాయకులు దరావత్ కళ్యాణ్, పందిల్ల పర్శరాములు, ఎడ్ల సందీప్, భూక్యా సంతోష్, బందారపు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలో చేరికలు..

- **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్‌ల సమక్షంలో...**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని 'ప్రజా పాలన'పై నమ్మకంతో వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు. తాజాగా, సిరిసిల్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చుక్క రాజశేఖర్ ఆధ్వర్యంలో నేడు సిరిసిల్లలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ లో గండి లచ్చపేట గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, కీలక నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సిరిసిల్లలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మరియు డీసీసీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. గండి లచ్చపేట ఉపసర్పంచ్ పుట్ట భాను, వార్డు సభ్యులు కుక్కల ఉమా, బామ్మ గారి వజ్రవ్వ , బల్లెపు జలంధర్, బామ్మ గారి పరుశురాములు, బల్లెపు నరసయ్య, బల్లెపు సత్తయ్య, కర్రోళ్ల రాములు, సుధాకర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కర్రల బాలయ్య లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మరియు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంగీ తం శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిని కాంక్షించి పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సాగు తున్న ఈ ప్రభుత్వంలో గండి లచ్చపేట గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వైద్య శివప్రసాద్, పూర్మాని రాం లింగారెడ్డి, గంగాధర మహిపాల్, ఇందిరమ్మ కాలనీ మాజీ సర్పంచ్ బైరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## మండేపల్లి సర్పంచ్‌కు రిటైర్డ్ జడ్జి చిరు సత్కారం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన గధగోని సాగర్ అత్యధిక మెజార్టీతో గెలుపొందడంతో ఆదివారం రోజున రిటైర్డ్ జడ్జి కొత్తపల్లి జనార్ధన్ గౌడ్ హైదరాబాద్ నూతనంగా ఎన్నికైన మండెపల్లి సర్పంచ్ గాధగోని సాగర్ ని శాలువా తో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే యువకుల తో సాధ్యమని గ్రామంలో ముందు ముందు నిత్యం ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సూచనలు ఇచ్చారు. నిత్యం గ్రామంలో విద్యార్థులకు యోగా, ధ్యానం, ప్లాస్టిక్ నిషేధం, ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు మరియు గ్రామ ప్రజలకు ప్రజా సౌకర్యాలు కల్పించాలని పలు సూచనలు తెలిపారు.



## ధర్మరక్షణకై శ్రీ మార్కండేయ స్వామి మాలధారణ దీక్షలు

- **పద్మకుల చిలుక నర్సప్ప**

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో శ్రీ మార్కండేయ స్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని 2026 జనవరి 1 నుండి 21 వరకు నిర్వహించనున్న మాలధారణ దీక్షల వివరాలను పద్మ కుల చిలుక నర్సప్ప (పద్మశాలి) వెల్లడించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లోక కళ్యాణం కోసం గురుస్వామి మార్గదర్శకత్వంలో భక్తి శ్రద్ధలతో ఈ దీక్షలు చేపట్టాలని, కులమతాలకు అతీతంగా స్త్రీలు, పురుషులు మరియు అన్ని వర్గాల ప్రజలు ఇందులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షల ద్వారా భక్తులకు విద్య, బుద్ధి, వ్యాపార అభివృద్ధి కలుగుతాయని, గ్రహ బాధలు మరియు శని దోషాలు తొలగి వివాహ ప్రాప్తి, సుఖసంతోషాలు చేకూరుతాయని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దూస రాజేశం, భీమనాథుని రమేష్, వాసాల శ్రీనివాస్, దూస శ్రీనివాస్, బిల్లా అశోక్, జగ్గయ్యతో పాటు పలువురు పద్మశాలి కుల బాంధవులు పాల్గొని దీక్షల ప్రాముఖ్యతను వివరించారు.



## మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సీరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో ఆదివారం రోజున కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేసి ఘనంగా ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




# ‘ది రాజా సాబ్’ ట్రైలర్ అదిరింది

**బలగం టీవీ, హైదరాబాద్**

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న క్షణం వచ్చేసింది. యంగ్ రెబల్ స్టార్ నటించిన తాజా చిత్రం లిలి‘ది రాజా సాబ్’లిలి ట్రైలర్ విడుదలై సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ‘డార్లింగ్’ తర్వాత ప్రభాస్‌ను ఫుల్ ఫన్ మోడ్‌లో చూడాలని ఎదురు చూస్తున్న అభిమానులకు ఈ ట్రైలర్ నిజంగా ఓ విజువల్ ట్రీట్‌గా మారింది.ట్రైలర్ ప్రారంభంలోనే “నానమ్మ ఈ ప్రపంచంలో నీకు అన్నీ మర్చిపోయే రోగం ఉన్నా, ఆయన్ను మాత్రం అస్సలు మర్చిపోలేవు” అనే డైలాగ్‌తో ఆసక్తి రేకెత్తిస్తుంది. నానమ్మ–మనవడి అనుబంధాన్ని భావోద్వేగంగా చూపిస్తూ కథను ముందుకు నడిపించారు. ప్రభాస్ వింటేజ్ లుక్, బాడీ లాంగ్వేజ్, స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులకు గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఈ చిత్రంలో ప్రభాస్ ఇప్పటివరకు చూడని ఓ విభిన్న పాత్రలో కనిపించనున్నాడు. ఓవైపు ఫన్, మరోవైపు మిస్టరీ, హారర్ ఎలిమెంట్స్‌ను మేళవిస్తూ కథను నడిపించిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కథ ప్రకారం తన తాత వారసత్వాన్ని తెలుసుకునే క్రమంలో రాజా సాబ్ ఒక రహస్యమైన రాజభవనంలో అడుగుపెడతాడు. “ఈ ఇల్లు మాయసభ ఇక్కడికి రావడం సులువు కానీ వెళ్లాలంటే మీ తాత సంతకం కావాలి” అనే డైలాగ్‌తో ఆ భవనం వెనుకున్న భయానక రహస్యం స్పష్టమవుతుంది.ఆ భవనంలో అడుగుపెట్టినవారు ఒక్కొక్కరుగా మాయమవుతుండటంతో కథ మరింత ఉత్కంఠభరితంగా మారుతుంది. ఆ వెనుక ఉన్న భయానక శక్తి ఎవరు? రాజా సాబ్ తాత గతంలో ఏం చేశాడు? అతడికి వ్యతిరేకంగా ఎందుకు నిలబడ్డాడు? వంటి ప్రశ్నలు ఆసక్తిని పెంచుతున్నాయి. ఫ్లాష్‌బ్యాక్‌లో దేవనగర సంస్థానం, గంగమ్మ పాత్రను శక్తివంతంగా చూపించడం సినిమాపై అంచనాలను మరింత పెంచింది. హారర్, ఫాంటసీ, ఎమోషన్, ఫన్ అన్నీ కలబోసిన ఈ చిత్రంలో ప్రభాస్ టైమింగ్, డైలాగ్ డెలివరీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. దాదాపు మూడేళ్ల తర్వాత ప్రభాస్ నుంచి వస్తున్న ఈ సినిమా సంక్రాంతికి థియేటర్లలో అభిమానులకు పండుగ వాతావరణం తీసుకురానుందనే సంకేతాలను ట్రైలర్ బలంగా ఇస్తోంది.

# బీఆర్‌ఎస్‌ను దీటుగా ఎదుర్కొవాలి

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీలో వాడివేడి చర్చ జరిగే అవకాశమున్నందున ఆయా నదీ పరివాహక ప్రాంతాల్లోని అధికార పార్టీ ఎమ్మెల్యేలంతా ఈ అంశాలపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. తద్వారా ప్రధాన ప్రతిపక్షంపై యుద్ధానికి సిద్ధమై రావాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. సోమవారం అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మంత్రులు, ప్రభుత్వ విప్‌లతో సీఎం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...తెలంగాణ నీటి వాటాలపై నిగ్గు తేల్చాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. అందువల్ల అందరూ సరిగ్గా ప్రిపేరై రావాలని, పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తటం ద్వారా ప్రధాన ప్రతిపక్షాన్ని ఇరుకున పెట్టాలని సూచించారు. ఈ మేరకు అధికార పార్టీ ఎమ్మెల్యేలందరూ సభకు హాజరయ్యేలా చూడాలంటూ మంత్రులు, ప్రభుత్వ విప్‌లను ఆదేశించారు. జనవరి ఒకటిన బేగంపేట ప్రజాభవన్‌లో ఏర్పాటు చేయబోయే పవర్ పాయింట్ ప్రజంటేషన్‌కు ఏ ఒక్కరికీ మినహాయింపు లేదని స్పష్టం చేశారు. నూతన సంవత్సర వేడుకల పేరు చెప్పి, ఎవరు డుమ్మా కొట్టినా ఊరుకోబోమని హెచ్చరించారు. కాగా అసెంబ్లీ లాబీల్లో తనకు ఎదురైన పాత్రికేయులతో ముచ్చటించిన సీఎం... బీఆర్‌ఎస్‌పైన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆ పార్టీ తన ఉనికిని కాపాడుకునే పనిలో ఉందని ఎద్దేవా చేశారు. సభలో కేసీఆర్‌తో ఏం మాట్లాడారంటూ అడగ్గా...‘అది మీకెలా చెబుతాం...’ అంటూ చమత్కరించారు. ప్రతీ సభ్యుడిని గౌరవించినట్టుగానే కేసీఆర్‌ను గౌరవిస్తామన్నారు. కేసీఆర్ గతంలో అనారోగ్యం పాలైనప్పుడు కూడా తాను ఆస్పత్రికి వెళ్లి పరామర్శించానంటూ సీఎం గుర్తు చేశారు. అసెంబ్లీ నుంచి తొందరగా కేసీఆర్ వెళ్లిపోవటాన్ని ప్రస్తావించగా...‘ఆ విషయంపై ఆయన్నే అడిగితే బాగుంటుంది...’ అని వ్యాఖ్యానించారు.

# కాళేశ్వరం ప్రాజెక్టును రికార్డు సమయంలో పూర్తి చేశాం

- **బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎవరైనా సరే ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టేటప్పుడు మొదట తాగునీటి అవసరాల పేరుతోనే ప్రారంభిస్తారు. కానీ ఈ యదార్థాన్ని రాజకీయంగా ఎవరూ బయటకు చెప్పరుబీ పోలవరం ప్రాజెక్టు గురించి 70 ఏళ్లుగా వింటున్నాం కానీ అది నేటికీ పూర్తి కాలేదు. కేవలం కేసీఆర్ నిబద్ధత వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు మా హయాంలోనే రికార్డు సమయంలో పూర్తయింది. కాలంతో పోటీ పడి మరీ కేసీఆర్ ఈ ప్రాజెక్టును నిర్మించారుబీ ఇప్పుడు కాళేశ్వరంలో అనవసర రంధ్రాన్వేషణ చేస్తే రాష్ట్రానికే నష్టం తప్ప, రాజకీయంగా మాకు వచ్చే నష్టం ఏమీ లేదు. ప్రజలకు అన్ని విషయాలు తెలుసు, తమకు సాగునీరు మరియు తాగునీరు అందించింది ఎవరో వారికి స్పష్టమైన అవగాహన ఉంది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు కోసం కేవలం 45 టీఎంసీలకు ఒప్పుకుంటే అది తెలంగాణ ప్రయోజనాలకు తీవ్ర అన్యాయం చేసినట్లే అవుతుంది. కృష్ణా జలాల్లో గతంలో 299 టీఎంసీలకు ఒప్పుకుంది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమేబీ దానిపైనే మా ప్రభుత్వం అదనపు కేటాయింపుల కోసం పోరాడింది.పాలమూరు ప్రాజెక్టు పూర్తి చేస్తే కేసీఆర్ పేరు వస్తుందని, తన పాత బాస్ చంద్రబాబు నాయుడు కోపం వస్తుందన్న భయంతోనే రేవంత్ రెడ్డి ఆ ప్రాజెక్టును కావాలనే పక్కన పెట్టారు. కృష్ణా నది నుంచి నీళ్లు తీసుకుంటే బాబు ఎక్కడ అలుగుతారోనని భయపడి, రేవంత్ ప్రాజెక్టు పనులను ఆపేయడమే కాకుండా కాలువలు కూడా తవ్వడం లేదు. రేవంత్ రెడ్డి అవినీతిని, అక్రమాలను మేము ఎండగట్టినందుకే ఆయన అసహనంతో బూతులు మాట్లాడుతున్నారు. నన్ను వ్యక్తిగతంగా ఏమన్నా నేను స్పందించను కానీ, మా నాన్న కేసీఆర్ అంటే మాత్రం అస్సలు ఊరుకునే ప్రసక్తే లేదు. రేవంత్ రెడ్డి స్థాయికి దిగజారి మాట్లాడవద్దని అభిమానులు కోరుతున్నందుకే నేను ఆయన బూతులకు అదే స్థాయిలో సమాధానం చెప్పడం లేదు. నీళ్ల గురించి మేము గట్టిగా అడిగితే సమాధానం చెప్పలేక రేవంత్ నికృష్టపు మాటలు మాట్లాడుతున్నారు.

కేసీఆర్ పెట్టిన ఒక్క ప్రెస్ మీట్‌కే ప్రభుత్వం గజగజ వణికిపోతోందిబీ అట్లాంటిది ఆయనను అసెంబ్లీకి రమ్మని డిమాండ్ చేయడం హాస్యాస్పదం. నీళ్ల సబ్జెక్టు అనేది నాలుగు రోజులు పుస్తకాలు చదివితే వచ్చేది కాదు, దాని కోసం రాష్ట్రం పైన నిజమైన ప్రేమ ఉండాలి. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలలో మా పార్టీ అదుతేమైన ఫలితాలను సాధించింది. కేవలం రెండు సంవత్సరాల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ముఖ్యమంత్రి ప్రకటించిన జాబితాలోనే ఇతర పార్టీల సర్పంచులను తమ వారుగా కలుపుకోవడం వారి దిగజారుడుతనానికి నిదర్శనం.

# మళ్లీ 2 నుంచి అసెంబ్లీ

- **జనవరి 7వ తేదీవరకు నిర్వహణ**
- **బీఏసీ నిర్ణయం**

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జనవరి రెండో తేదీ నుంచి మళ్లీ ప్రారంభం కానున్నాయి. దాదాపు వారం రోజుల పాటు అంటే జనవరి 7 వరకు సభ జరగనుంది. మంగళ, బుధ, గురువారాల్లో సమావేశాలకు విరామం ఉండనుంది. సోమవారంతో కలిపి ఏడు రోజులు సభను నిర్వహించనున్నారు. జనవరి 2నుంచి 6 వరకు సమావేశాలు చేపట్టాక బీఏసీ నిర్వహిస్తారు. అనంతరం సభను జరపాలా ? వద్దా ? అనేది 7న జరిగే బీఏసీలో తేలనుంది. కాగా సోమవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన శాసనసభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) సమావేశం జరిగింది. స్పీకర్ చాంబర్‌లో జరిగిన ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ బీర్ల ఐలయ్య, సభ్యులు టి హరీశ్‌రావు, మహేశ్వర్‌రెడ్డి, అక్బరుద్దీన్ ఓవైసీ, కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. అలాగే శాసనమండలి కార్యదర్శి వి. నరసంహాచార్యులు, అసెంబ్లీ కార్యదర్శి ఆర్.తిరుపతి పాల్గొన్నారు. ఈసందర్భంగా దాదాపు గంటపాటు సమావేశం జరిగింది. అసెంబ్లీ పనిదినాలకు సంబంధించి బీఏసీలో చర్చకొచ్చింది. అసెంబ్లీని వారం రోజుల పాటు నిర్వహించి మళ్లీ బీఏసీ నిర్వహిస్తామని స్పీకర్ సభ్యులకు తెలియజేశారు. జనవరి 2నుంచి 7వరకు సమావేశాలు నిర్వహించిన తర్వాత మళ్లీ బీఏసీ నిర్వహిస్తామని స్పీకర్ చెప్పినట్టు సమాచారం. ఈనేపథ్యంలో ఆయా పార్టీలకు చెందిన సభ్యులు మాట్లాడుతూ సాధ్యమైనన్నీ ఎక్కువ రోజులు సభను జరపాలని కోరారు.

బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో ఆయా అంశాల చర్చ సందర్భంగా పీపీటీ నిర్వహించేందుకు కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అప్పుడు బహిష్కరించాల్సి వచ్చిందన్నారు. ప్రజా సమస్యలపై అవసరమైనన్నీ రోజులు చర్చలకు సిద్ధమన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యకలాపాలతోపాటు ప్రజాసమస్యలపై చర్చించేందుకు సర్కారు వెనక్కిపోదని అన్నారు. బిజినెస్ రూల్స్ ప్రకారం సభ నడుస్తుందన్నారు.

బీఏసీ సమావేశం ముగిసిన తర్వాత హరీశ్‌రావు మీడియాతో చిట్‌చాట్ చేశారు. అసెంబ్లీ సమావేశాలు 15 రోజులు జరపాలని పట్టుబట్టినట్టు చెప్పారు. అయితే వారం రోజులు జరిపి తర్వాత మళ్లీ బీఏసీ పెడతామని స్పీకర్ చెప్పినట్టు వివరించారు. అసెంబ్లీ పీపీటీ నిర్వహించేందుకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను కోరినట్టు చెప్పారు. ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని స్పీకర్ అన్నట్టు తెలిపారు. గతంలో కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వనందుకు బహిష్కరించినట్టు భట్టి విక్రమార్క అన్నట్టు హరీశ్‌రావు చెప్పారు. ఇందుకు ఇప్పుడు అవకాశం ఇవ్వకపోతే బాయ్‌కాట్ చేయాలా అని ప్రశ్నించినట్టు తెలిపారు. ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు కనీసం 20 రోజులపాటు నిర్వహించాలని కోరారు. 32 అంశాలపై చర్చించాలని చెప్పారు. జనవరి 7 వరకు సమావేశాలు నిర్వహించాలని, ఆ తర్వాత బీఏసీ జరిగేలా నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు.

# తొలి రోజు ప్రశాంతంగా చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

రాఘువ కన్‌స్ట్రక్షన్ కంపెనీ తన నియోకవర్గంలోని తనుగుల చెక్‌డ్యామ్‌ను బాంబు పెట్టి పేల్చిందని ఆరోపించారు. దీంతో సభలో ఉద్రిక్తత నెలకొంది. ఈడ కూర్చొని మాట్లాడటం గాదు తన నియోజకవర్గానికి వచ్చి చూడాలంటూ కాంగ్రెస్ సభ్యులకు కౌశిక్‌రెడ్డి సవాల్ విసిరారు. ఇంతలోనే కౌశిక్‌రెడ్డి మైక్‌ను స్పీకర్ కట్ చేశారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను తొలగించాలని కాంగ్రెస్ సభ్యులు పట్టుబట్టారు.

కాంగ్రెస్ సభ్యులు రాంచందర్‌నాయక్ మాట్లాడుతూ..తన నియోజకవర్గంలోని హామ్లెట్ గ్రామాల్లో రేషన్ షాపులకు సంబంధించిన సబ్ సెంటర్లను పెట్టి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరారు. రేషన్ తెచ్చుకోవడానికి కొన్ని కిలోమీటర్ల దూరం నడవాల్సి వస్తున్నదని చెప్పారు. తన నియోజకవర్గంలో కోతుల సమస్య తీవ్రంగా ఉందనీ, రైతుల పంటలను ఆగం చేస్తున్నాయని సభలో ఏకరువు పెట్టారు. ఇంతలోనే స్పీకర్ ప్రసాద్‌కుమార్ జోక్యం చేసుకుంటూ...తన నియోజకవర్గంలోనూ కోతుల సమస్య తీవ్రంగా ఉందనీ, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీన్ని పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలతో మైనింగ్ రంగం ప్రయివేటు పరం అవుతుందనీ, అందులో భాగంగా సింగరేణి కూడా ప్రయివేటుపరం అయిపోయే ప్రమాదం ఉందని సీపీఐ పక్షనేత కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. సింగరేణి పరిరక్షణ కోసం దాని పరిధిలోని ఎమ్మెల్యేలతో సీఎం ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కోరారు. తీవ్ర అసంతృప్తిలో ఉన్న సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని విన్నవించారు. డిపెండెంట్ ఎంప్లాయ్ వ్యవస్థ సరిగా అమలు కావడం లేదన్నారు. కారుణ్య నియామకాల వయస్సు 40 ఏండ్లకు పెంచారనీ, మెడికల్ బోర్డు సమావేశాలు మొక్కుబడిగా జరుగుతున్నాయని విమర్శించారు. కేంద్రం నిర్ణయాల వల్ల సింగరేణి బ్లాకులు ప్రయివేటు సంస్థల చేతుల్లోకి వెళుతున్నాయనీ, కనీసం బొగ్గు వెలికి తీసే పనినైనా సింగరేణికి అప్పగించాలని సూచించారు. కోలిండియా తరహాలో సింగరేణిలోనూ ట్యాక్స్ రిటర్న్ చేయాలని కోరారు. సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని విన్నవించారు.

కాంగ్రెస్ సభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ..రామన్నపేటలోని ప్రభుత్వాస్పత్రిని వంద పడకలకు విస్తరించాలని సభాదృష్టికి తీసుకొచ్చారు. భువనగిరి నియోజకవర్గంలోని వలిగొండలో 30 పడకలకు ఆస్పత్రిని విస్తరించాలని కోరారు. తాండూరు ఆస్పత్రిలో ఐసీయూని ఏర్పాటు చేయాలని మనోహర్‌రెడ్డి విన్నవించారు. బీఆర్‌ఎస్ సభ్యులు ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ..భీంగల్ మున్సిపాల్టీలోని ఆస్పత్రిని వంద పడకలకు విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే అక్కడ 80 శాతం పనులు పూర్తయ్యాయనీ, రూ.5 కోట్లు వెచ్చిస్తే మిగిలిన పనులు పూర్తయితాయని సభాదృష్టికి తీసుకొచ్చారు. పెండింగ్ బిల్లులు విడుదల చేసి ఆస్పత్రిని పూర్తిచేయాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారనీ, పోడురైతులను సాగు చేసుకోనివ్వడం లేదని ఎడ్మ బుజ్జి, పాయం వెంకటేశ్వర్లు, రాంచందర్‌నాయక్ ప్రస్తావించారు. ఆలేరు నియోజకవర్గ కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలనీ, తన నియోజకవర్గంలో ఒక కొత్త మండలాన్ని ఏర్పాటు చేయాలని విప్ బీర్ల అయిలయ్య విన్నవించారు. టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలనీ, సబ్జెక్టుతో సంబంధంలేని ఇతర అంశాల నుంచి ప్రశ్నలు ఇవ్వడమేంటని పి.రామ్మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. టీచర్లకు టెట్ నుంచి మినహాయించాలని కేంద్రానికి లేఖ రాయాలని కోరారు.

సభలో ఎదుటి సభ్యులను గౌరవిస్తూ సభామర్యాదల్ని కాపాడాలని బీజేపీ సభ్యులు కె.వెంకటరమణారెడ్డి కోరారు. బూతులు మాట్లాడే అవలక్షణాన్ని సభ్యులు విడనాడాలని విజ్ఞప్తి చేశారు. సభలోని 57 మంది కొత్త సభ్యులకు సీనియర్ సభ్యులు ఆదర్శంగా ఉండాలని కోరారు. కేసీఆర్, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, సభ్యులందరూ మంచి సందేశాన్ని ఇచ్చి సభా సాంప్రదాయాలను కాపాడాలని విన్నవించారు. అసభ్యకర మాటలతో వరల్డ్ క్లాస్ నగరమైన హైదరాబాద్‌ను థర్డ్ క్లాస్ సిటీగా మార్చొద్దన్నారు. నేతల మాటలను అలుసుగా తీసుకుని ప్రధానిని మొదలుకొని ఎమ్మెల్యేల వరకు మీడియావాళ్లు ఏకవచనంతో సంబోధిస్తున్న విషయాన్ని ఎత్తిచూపారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నలు లేవనెత్తితే మంత్రులు సమాధానం ఇచ్చేందుకు పూర్తి సమాచారంతో సభలో అందుబాటులో ఉండాలని కోరారు. జీరో అవర్‌లో సభ్యుల ప్రశ్నలకు అవసరమైన సమాధానాలు అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధం చేయాలని సూచించారు. పెండింగ్ నివేదికలు, హామీలకు సంబంధించిన అంశాల పూర్తి సమాచారంతో అధికారులు సిద్ధంగా ఉండాలని అన్నారు. అసెంబ్లీ, మండలి కార్యదర్శులు ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, శాసనమండలి కార్యదర్శి నరసింహచార్యులు, అసెంబ్లీ కార్యదర్శి తిరుపతి, సీనియర్ అధికారులు వికాస్‌రాజ్, దానకిషోర్, జయేష్ రంజన్, రఘునందన్‌రావు, శ్రీధర్, నదీమ్ అహ్మద్, శైలజ రామయ్యర్, యోగితారానా, లోకేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.